

పెరిగిన టమోటా ధర

శిడ్లఘట్ట, జూన్ 21: పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా టమోటా ధర పెరుగుతోంది. మూడు రోజులుగా కిలో టమోటా రూ.60-80 మధ్య ఉంది. హోల్‌సేల్ మార్కెట్‌లో 15కిలోల బాక్స్ నాణ్యతనుబట్టి రూ.400 నుంచి 900 వరకు ధర పలుకుతోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా జూన్ నెలలో దిగుబడి తక్కువగా ఉంటుంది. ఈ కారణంగానే ఉన్న పంటకు ధర ఎక్కువగా లభిస్తుందని రైతులు అంటున్నారు. అయితే పెరిగిన ధరలతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు.


ఆసనాలు వేస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి, డీసీఎం డీకే శివకుమార్

యోగాతో ఆరోగ్యం

- గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్
- రాష్ట్ర వ్యాప్తంగా యోగా సంబరం

బెంగళూరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): యోగా అనేది ఆధ్యాత్మికత నుంచి వచ్చిన ఒక సంప్రదాయమని, ఆరోగ్యం, మానసిక ప్రశాంతత దాంతో సాధ్యమవుతాని రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్‌గెహ్లాట్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విధానసౌధ తూర్పుద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో గవర్నర్ పాల్గొన్నారు. వేలాదిమంది ఔత్సాహికులు భాగస్వామ్యులయ్యారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి, మంత్రి దినేశ్ గుండూరావు, ఎమ్మెల్సీ శరవణ, అథ్లెటిక్ అశ్వినినాచప్ప, క్రికెటర్ మనీశ్‌పాండే, నటులు అనుప్రభాకర్, శరణ్ తదితరులు పాల్గొన్నారు. యోగా విన్యాసాలు చేశారు. బీజేపీ కార్యాలయం వద్ద యోగా శిబిరంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, మాజీ డీసీఎం అశ్వత్థనారాయణతోపాటు పార్టీ కార్యకర్తలు, స్థానికులు యోగా చేశారు. బెంగళూరు యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన శిబిరంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పీఈఎస్ యూనివర్సిటీలో...

నగరంలోని పీఈఎస్ యూనివర్సిటీ క్యాంపస్‌లో వేలాదిమంది విద్యార్థులు యోగా విన్యాసాలు చేశారు. వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ సూర్యప్రసాద్, రిజిస్ట్రార్ శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన యోగా డేలో చాన్స్‌లర్ ఎంఆర్ దొర స్వామి సందేశాన్ని వినిపించారు. యోగా ద్వారా ఆరోగ్యం, జ్ఞానం, ఏకాగ్రత సాధ్యమని వైస్‌చాన్స్‌లర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలు, యూనివర్సిటీలు ప్రభుత్వ కార్యాలయాలలో యోగా విన్యాసాలు చేశారు.


విధానసౌధ వద్ద...


బెంగళూరు యూనివర్సిటీలో




విజయేంద్ర, అశ్వత్థనారాయణ


మల్లేశ్వరం లోని బీజేపీ కార్యాలయం వద్ద యోగా

నటి శ్రీలీల


ముఖ్యమంత్రి సిద్ధరామయ్య యోగాభ్యాసం

ఉత్సాహంగా పాల్గొన్న సీఎం.. నటి శ్రీలీల

బళ్లారి సిటీ, జూన్ 21: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం సండూరు తాలూకాలోని జేఎస్‌డబ్ల్యూ టౌన్‌షిప్ విద్యానగర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో పాల్గొన్న హరిహర పంచమసాలి పీఠాధిపతి వచనానంద స్వామీజీ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా రోజంతా ఉల్లాసంగా ఉండేలా చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగా సాధన చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య యోగాపై అమితాసక్తి కనబరుస్తూ వివిధ అసనాలను అభ్యసించారు. ప్రముఖ సినీ నటీ శ్రీలీల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె కూడా ఉత్సాహంగా యోగాభ్యాసనాలు చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరినీ ఈ విధంగా కలవడం చాలా ఆనందంగా ఉందని శ్రీలీల పేర్కొన్నారు. క్రమం తప్పకుండా యోగా సాధన ఆరోగ్యానికి మంచిదని, ప్రతి ఒక్కరూ నిత్యం యోగా సాధన చేయాలని పిలుపునిచ్చారు. బళ్లారి జిల్లాకు చెందిన చిత్రకారుడు మంజునాథ్ గోవిందవాడ రూపొందించిన సిద్ధరామయ్య చిత్రపటాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. 12వ శతాబ్దానికి చెందిన కవయిత్రి అక్కమాదేవి భారీ చిత్రపటాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అవిష్కరించారు. వేలాది మంది విద్యార్థులు, చిన్నారులు, ప్రజలు యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్మికశాఖ మంత్రి సంతోష్‌లాడ్, ఎంపీ తుకారం, కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, సీఈఓ రాహుల్ శరణప్ప, ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, సబ్ డివిజనల్ అధికారి హేమంత్ , కేఎంఎఫ్ అధ్యక్షుడు బీమానాయక్, శాసనమండలి సభ్యుడు గోవిదరాజులు, వడ్డు గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు నింగమ్మనాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కకు నీరుపోసి యోగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం

చెన్నపట్టణపై ఇప్పుడే ప్రేమెందుకో..!

- డీసీఎంపై కేంద్రమంత్రి కుమార ఎద్దేవా

బెంగళూరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): చెన్నపట్టణ శాసనసభ స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీరుపై కేంద్రమంత్రి కుమారస్వామి ఎద్దేవా చేశారు. ఢిల్లీలో యోగా దినోత్సవంలో పాల్గొన్న తర్వాత కన్నడ మీడియాతో ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలు జరిగిన ఏడాది నుంచి గుర్తుకు రాని చెన్నపట్టణపై ఒక్కసారిగా ప్రేమ, అభిమానం పుట్టుకొచ్చాయన్నారు. చెన్నపట్టణ అభివృద్ధి చేయవద్దని ఎవరైనా అడ్డుకున్నారా..? అంటూ ప్రశ్నించారు. పదేళ్లుగా ఎంపీగా ఉండే మీ తమ్ముడు డీకే సురేశ్ నియోజకవర్గానికి చేసిందేమిటని ప్రశ్నించారు. ఇప్పుడు చెన్నపట్టణ అభివృద్ధి చేయాలని, ఇక్కడే తన రాజకీయం ప్రారంభమైందని చెప్పుకోవడం వెనుక వ్యూహం కాక ప్రగతి ఎక్కడ ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా అభ్యర్థి కావచ్చునని,




జేడీఎస్ నుంచి ఎవరు పోటీ చేస్తారనేది కాలం నిర్ణయిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్‌కు ఎక్కువ సీట్లు వచ్చేందుకు ఈవీఎంలు కారణమైతే అంతకు కొన్ని నెలల ముందే జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 135 స్థానాలు రావడానికి అదే కారణమై ఉంటుందన్నారు. యోగా మన సంస్కృతి అని 2014 నుంచి అంతర్జాతీయస్థాయిలో జరపడం సంతోషంగా ఉందన్నారు. మైసూరు ప్యాలెస్ మైదానంలో గత ఏడాది ప్రధాని నరేంద్ర మోదీ యోగా దినోత్సవంలో పాల్గొన్నారని గుర్తు చేశారు.

బెంగళూరుకు మరో విమానాశ్రయం

- డీపీఆర్‌కు మంత్రి ఎంబీ పాటిల్ ఆదేశం

బెంగళూరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు మరో విమానాశ్రయం రానుందని జోరుగా చర్చ జరుగుతోంది. గురువారం ఉన్నతాధికారుల సమీక్షలో భారీ పరిశ్రమలు, మౌలికాభివృద్ధి శాఖ మంత్రి ఎంబీ పాటిల్ ఈ విషయాన్ని ప్రస్తావించారు. నగర అభివృద్ధి సాగుతున్న విధానం, సవాళ్లను దృష్టిలో ఉంచుకుని మరో విమానాశ్రయం ఏర్పాటు చేసేలా డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. 2033 వరకు బెంగళూరుకు రెండో విమానాశ్రయం ఏర్పాటు సాధ్యం కాదు. కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్‌తో 25 ఏళ్ల ఒప్పందానికి సంతకాలు చేశారు. ఈ మేరకు 150 కిలోమీటర్ల పరిధిలో రెండో విమానాశ్రయం ఏర్పాటుకు వీలుండదు. మరో 9ఏళ్లతో ఒప్పందం ముగుస్తుంది. కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ దేశరాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై తర్వాత దేశంలోనే అతిపెద్ద మూడో విమానాశ్రయం. గత ఏడాది ఇక్కడి నుంచి 37.5 మిలియన్ల మంది ప్రయాణికులు 4 లక్షల టన్నుల సరుకుల రవాణా జరిగింది. ఈ భారం తగ్గించాలంటే రెండో విమానాశ్రయం అవసరమని భావిస్తున్నారు. బెంగళూరు జనాభా 1.30 కోట్లుగా ఉంది. ఎంఎన్‌సీ, ఐటీ, బీటీ కంపెనీలు, డిఫెన్స్, ఎయిర్‌లైన్స్‌కు సంబంధించి వేలాది కంపెనీలు ఉన్నాయి. ప్రస్తుతం విమానాశ్రయం బెంగళూరుతోపాటు సమీపంలోని పది జిల్లాలకు, పొరుగున ఉండే ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలకు అనుకూలంగా ఉంది. 2033నాటికి ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. సరుకు రవాణా కూడా 2040 నాటికి రెట్టింపు సామర్థ్యం వచ్చే అవకాశం ఉంది. ఇలా బెంగళూరుకు రెండో విమానాశ్రయం అవసరమని ఆలోచిస్తున్నారు. రెండో విమానాశ్రయం కోసం భూస్వాధీనం, పరిహారం వంటి ప్రక్రియలు సులభతరంగా ముగియవు. ఇప్పుడు ప్రారంభిస్తే పదేళ్లకు ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. రెండో విమానాశ్రయం ద్వారా పరిశ్రమల అభివృద్ధికి ఊతమిచ్చే అవకాశం ఉంది. 2020లో ఎఫ్‌కేసీసీఐ, బెంగళూరు చాంబర్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ కామర్స్ రాష్ట్ర రాజధానికి రెండో విమానాశ్రయం అవసరమని రామనగర, చెన్నపట్టణ మధ్య ఏర్పాటు చేస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. మరోవైపు హోంశాఖ మంత్రి పరమేశ్వర్ తుమకూరు జిల్లాలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు డిమాండ్ చేశారు. తుమకూరు, కొరటగెరె, మధుగిరి, శిర తాలూకాల్లో 8వేల ఎకరాల భూమి ఎయిర్‌పోర్ట్‌కు లభించనుందని ఈ ఏడాది జనవరిలో ఆయన తెలిపారు. ప్రస్తుతం బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు అనుబంధంగా నిర్మించిన రెండో టెర్మినల్ ఆసియాఖండంలోనే అద్భుతమైనదిగా గుర్తింపు పొందింది. ఏడాది క్రితమే ఈ రెండో టెర్మినల్ అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం వీవీఐపీల కోసం హెచ్ఏఎల్ ఎయిర్‌పోర్ట్ సేవలందిస్తోంది.


బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,582.32	1,579.52
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	831	367
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,802	1577
సామర్థ్యం (టీఎంసీలు)	5.70	4.24

యోగాతో మానసిక ధృడత్వం



యోగాసన స్థితిలో న్యాయాధికారి పుష్పాంజలి దేవి

బళ్లారి సిటీ, జూన్ 21: యోగాలో పాల్గొనడం ద్వారా ప్రతి వ్యక్తి మనస్సును, శరీరాన్ని ధృడంగా ఉంచుకోవచ్చని న్యాయాధికారి పుష్పాంజలి దేవి అన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, జిల్లా న్యాయవాదుల సంఘం, పతంజలి యోగా ఎడ్యుకేషన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బళ్లారి తాళూరు రోడ్డులోని నూతన కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్నిఆమె ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు యోగాసనాలు వేయడం అలవాటు చేసుకోవాలన్నారు. పతంజలి యోగా శిక్షా సమితి జిల్లా అధ్యక్షుడు న్యాయవాది రామ్ బ్రహ్మం యోగసనాలపై మార్గనిర్దేశం చేశారు. ఈసందర్బంగా సివిల్ న్యాయాధికారులు రాజేశ్ హొసమనె, ఇబ్రహీం ముజావర్, అపర్ణ పాల్గొన్నారు. కార్యక్రమానికి సిద్దలింగప్రభు, విద్యాధర శిరహట్టి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎర్రిగౌడతో పాటు పలువురు హాజరయ్యారు.

ఉపాధ్యాయుడిని అభినందించిన డీడీ



ఉపాధ్యాయులకు అభినందిస్తున్న డీడీ ఉమాదేవి

కంప్లి, జూన్ 21 : కంప్లి తాలుకా పరిధిలోని దేవలాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని, తోటి ఉపాధ్యాయులను జిల్లా శిక్షణ అధికారి ఉమాదేవి అభినందించారు. వేసవి సెలవుల్లో కొంచం చదువు ఎక్కువ ఆట అనే కార్యక్రమంలో తమకిచ్చిన నిధులతో చెస్, ఖోఖో, ట్రిప్పింగ్, కోలాటం, జానపద గీతాలు, కంప్యూటర్ విద్య తదితర విషయాలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి కృషిచేసిన ప్రధానోపాధ్యాయుడిని ఆమె మెచ్చుకున్నారు. ఈ సందర్బంగా ఉమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విద్యార్థులను తమ పిల్లలుగా భావించి విద్యా బోధన చేస్తేనే ఆ పాఠశాలకు గుర్తింపు వుంటుందన్నారు. ఈ తాలుకాలో ప్రతి ఒక్కరు ఈ ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వారితో పాటు డీఈవో సిద్దలింగమూర్తి, హెచ్ఎం సోమశేఖర్, ఎస్‌డీఎంసీ అధ్యక్షులు నాగేష్, జ్యోతి, గీత, రాగశ్రీ, నాగరాజు, బసవరాజ, మహమ్మద్, కవిత తదితరులు పాల్గొన్నారు.

నందీష్‌కు కుటుంబ సభ్యుల శుభాకాంక్షలు



బళ్లారిరూరల్, జూన్ 21 : బళ్లారి నగరపాలిక నూతన మేయర్‌గా ముల్లంగి నందీష్‌బాబు ఎన్నిక కావడంతో అతని సతీమణి సుధ, కుటుంబ సభ్యులు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధిహామీకి పీడీ ఖాతా నిధులు

విజయనగర జిల్లా సమావేశంలో సీఎం సిద్దూ ఆదేశాలు



ప్రగతి పరిశీలనా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

- 10వ తరగతి ఫలితాలపై ఆగ్రహం - డీడీపీఐ సస్పెన్షన్
- గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఏర్పడితే సీఈఓదే బాధ్యత
- రైతులకు ఎరువుల పంపిణీలో సమస్యలకు చెక్

బళ్లారి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): నరేగా ఉపాధి హామీ పథకానికి నిధుల కొరత రారాదని, అవసరమైతే పీడీ ఖాతా నుంచి నిధులు ఖర్చు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధికారులకు సూచించారు. నూతన విజయనగర జిల్లా ఏర్పాటై మూడు సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ముఖ్యమంత్రి నేతృత్వంలో శుక్రవారం త్రైమాసిక కెడిపి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ, చెరువుల ఆక్రమణలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తొలగించాలని ఆదేశించారు. ఆక్రమణకు గురైతే ఆయకట్టు ప్రాంతాలకు నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. చెరువులకు పునర్జీవం కల్పించాలని సలహా ఇచ్చారు. జిల్లా పరిధిలో మూతబడిన 52 తాగునీటి పథకాల విషయంపై ఆయన అధికారులను ప్రశ్నించగా, అధికారులు ఇచ్చిన సమాధానాలపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో వ్యక్తి గత శుభ్రతను కాపాడే దిశగా గ్రామ పంచాయతీ స్థాయిలో అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు మరుగుదొడ్లు లేని కుటుంబాలు ఎన్ని ఉన్నాయని అధికారులను ప్రశ్నించగా, అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా హొసపేట నగరంలో 200 పడకల ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఉన్నతీకరణ చేసేందుకు నివేదికలు పంపాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న నరేగా పథకం పనుల్లో కూలీలకు సరిగా కూలి అందజేయాలన్నారు. అంగనవాడీ కట్టడాలు, పాఠశాల గదుల నిర్మాణాలు, కాంపౌండ్ నిర్మాణాలు చేపట్టాలన్నారు.

తాగునీటి సమస్యకు జడ్పీ సిఈఓదే బాధ్యత

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఏర్పడకుండా జిల్లా పంచాయతీ సిఇఒ అవసరమైన చర్యలు చేపట్టాలని, సమస్యలు తలెత్తితే జడ్పీ సిఇఓనే బాధ్యుడిగా పరిగణించాల్సి వస్తుందన్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాంతానికి ఒక్క ఇల్లుకూడా మంజూరు చేయలేదని, తమ ప్రభుత్వం వచ్చిన తరువాత 500 కోట్లు మంజూరు చేసి ఇప్పటి వరకు 1500 ఇళ్ళు పూర్తి చేసి ప్రజలకు పంపిణీ చేసినట్లు, మిగిలిన 1600 ఇళ్ళు మురికి వాడల అభివృద్ధి బోర్డు నుండి పూర్తి చేస్తామని చెప్పారు. జిల్లాలో 41 చెరువులను నీటితో నింపే కార్యక్రమం చేపట్టినట్లు, మిగిలిన 9 చెరువులను నింపాలని అధికారులకు సూచించారు.

టెన్త్ ఫలితాలపై ఆగ్రహం , డీడీపీఐ సస్పెన్షన్

జిల్లాలో ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో జిల్లా 10వ స్థానం నుండి 27వ స్థానానికి పడిపోయిందని, దీనిని సీరియస్‌గా పరిగణించి డీడీపీఐని సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ స్థితిగతులపై చర్చించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, రసాయనిక ఎరువుల కొరత లేకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.130కోట్ల కరువు పరిహారం లబ్దిదారులకు అందజేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో రైతు ఆత్మహత్యలకు సంబంధించి అధికారులను ప్రశ్నించగా, గత ఏడాది జిల్లాలో 34మంది ఆత్మహత్యలు చేసుకోగా, ఈ ఏడాది ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నట్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మృతుల కుటుంబానికి తలా 5లక్షలు పరిహారం అందజేసినట్లు అధికారులు తెలిపారు. ఇంకా ఐదుగురు రైతులకు పరిహారం పెండింగ్‌లో ఉందని తెలిపిన అధికారులపై ముఖ్యమంత్రి మండిపడ్డారు.

ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి గోవిందరాజు, ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారులు బసవరాజు రాయరెడ్డి, ఎంపి ప్రభా మల్లికార్జున, ఎమ్మెల్యేలు హెచ్.ఆర్. గవియప్ప, కంప్లి ఎమ్మెల్యే గణేష్, ఎంపి లతా, డాక్టర్ టి.శ్రీనివాస్‌లు ప్రగతి పరిశీలనా సమావేశానికి హాజరయ్యారు. సమావేశానికి ముందు బళ్లారి జిల్లా తోరణగల్లు జిందాల్ కంపెనీ ఆవరణలో శుక్రవారం ఉదయం జరిగిన జాతీయ స్థాయి 10వ అంతర్జాతీయ యోగా శిబిరంలో పాల్గొన్న ముఖ్యమంత్రి కార్యాక్రమం అనంతరం హొసపేట నగరానికి చేరుకున్నారు. ఈ సందర్బంగా అనంతశయనగుడి వద్ద ఉన్న తన బంధువు బసవరాజు దేవరమని ఇంటికి వెళ్ళి ఉపహారం సేవించారు. అనంతరం ప్రగతి పరిశీలన సమావేశంలో పాల్గొన్నారు.

మేయర్ కిరీటం ముల్లంగి నందీష్‌కే



మేయర్‌గా ఎన్నికైన ముల్లంగి నందీష్‌బాబు, ఉపమేయర్‌గా సుకుం బీ



విజేతలకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

- నాటకీయ పరిణామాల మధ్య ఎన్నిక ● ఉప మేయర్‌గా సుకుంబీ
- ఎమ్మెల్యేలు భరత్‌రెడ్డి, బి.నాగేంద్ర, ఎంపీలు నాసీర్ హుసేన్, తుకారాం, ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి ఓటింగ్‌కు హాజరు

బళ్లారి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): అత్యంత ఉత్కంఠ పరిస్థితుల మధ్య సాగిన బళ్లారి మేయర్ ఎన్నికలో కాంగ్రెస్ కార్పొరేటర్ ముల్లంగి నందీష్ బాబు విజయం సాధించారు. ఉపమేయర్‌గా 26వ వార్డు కార్పోరేటర్ సుకుం బీ ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి బాజ్‌పే చెప్పారు. బళ్లారి 23వ మేయర్, ఉపమేయర్ ఎన్నికలు శుక్రవారం నగర పాలికే సభాభవనంలో జరిగాయి.

కాంగ్రెస్ తరపున మేయర్ స్థానానికి ముల్లంగి నందీష్‌బాబు, ముండ్లూరు ప్రభంజన్ కుమార్, గాదెప్ప, వివేక్‌లు నామినేషన్ వేయగా, బీజేపీ నుంచి కార్పొరేటర్ శ్రీనివాస్ మోత్కర్ నామినేషన్ వేశారు. తర్వాత కాంగ్రెస్ తరపున నామినేషన్‌లు వేసిన నలుగురిలో ముండ్లూరు ప్రభంజన్ కుమార్, గాదెప్ప, వివేక్ విత్‌డ్రా చేసుకోగా పోటీలో ముల్లంగి నందీష్ బాబు మాత్రమే నిలిచారు. కాంగ్రెస్ తరపున 26 మంది కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, నారా భరత్‌రెడ్డి, మాజీ మంత్రి బి. నాగేంద్ర, ఎంపీ (రాజ్యసభ) నసీర్ హుసేన్, లోక్‌సభ సభ్యుడు తుకారాం మొత్తం 30 మంది ఓటింగ్‌లో పాల్గొనగా, బీజేపీ నుంచి 13 మంది కార్పొరేటర్లతో పాటు ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి కలిపి మొత్తం 14 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు.

మూజువాణీ పద్ధతిలో జరిగిన ఓటింగ్‌లో బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ మోత్కర్‌కు 14 ఓట్లురాగా, కాంగ్రెస్ అభ్యర్థి ముల్లంగి నందీష్‌బాబుకు 30 ఓట్లు వచ్చాయి. దీంతో మేయర్‌గా కాంగ్రెస్ అభ్యర్థి ముల్లంగి నందీష్ బాబు విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఉపమేయర్‌గా 26వ వార్డు కార్పొరేటర్ సుకుం బీ గెలుపొందినట్లు తెలిపారు. అలాగే నలుగురు స్థాయి సమితి సభ్యులు కూడా ఎన్నికయ్యారు. మేయర్‌గా ఎన్నికైన నందీష్‌బాబుకు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

ప్రజల సహకారంతో నగర అభివృద్ధికి శ్రమిస్తా - మేయర్ నందీష్ బాబు

మేయర్‌గా ఎన్నికైన ముల్లంగి నందీష్ బాబు అనంతరం విలేకరులతో మాట్లాడారు. తనకు వచ్చిన అవకాశాన్ని ప్రజలకుసేవలు చేయడానికి వినియోగిస్తానన్నారు. బళ్లారి నగరంలో రోడ్లు, తాగునీటి సమస్య, అండర్‌డ్రైనేజీల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేస్తామని పేర్కొన్నారు. తాను నగర ప్రజలకు అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో అండగా ఉంటానని పేర్కొన్నారు.

పార్టీ నిర్ణయం ప్రకారమే మేయర్ ఎన్నిక - మాజీ మంత్రి నాగేంద్ర

ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డి.కే శివకుమార్ ఇతర కాంగ్రెస్ సీనియర్లు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్పొరేటర్ల అభీష్టం ప్రకారమే మేయర్‌గా నందీష్‌బాబును ఎన్నుకున్నట్లు మాజీ మంత్రి బి. నాగేంద్ర, ఎంపీ తుకారాం, నసీర్ హుసేన్ తెలిపారు. అనంతరం మేయర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



ఎద్దులను ఊరేగిస్తున్న దృశ్యం

సిరుగుప్ప, జూన్ 21 : ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ఎద్దుల పందాలు జరిగాయి. సిరుగుప్ప తాలూకాలో ఎద్దులను ఎంతో అందంగా అలంకరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎద్దులను ఘనంగా ఊరేగించారు. సాయంత్రం గాంధీజీ సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ఎద్దుల పందాలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ తాయమ్మదేవి అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు.

రసాయన ఎరువులకు బదులు..



చిక్కజాగనూరు వద్ద రైతులు ఏపుగా పెంచిన జూమి

కంప్లి, జూన్ 21 : తుంగభద్ర జలాశయం ఎడమ, కుడి కాలువల కింద రైతన్నలు ఖరీఫ్ పంటలు ఏపుగా వచ్చేందుకు రసాయనిక ఎరువులకు బదులుగా తమ పొలాల్లో ఏపుగా జూమి పెంపకం చేపడుతున్నారు. ఇప్పటికే పొలాల్లో వరి పంట పెంపకం కోసం రసాయనిక ఎరువులు వాడటం వల్ల పొలాల్లో సారం తగ్గిపోవడంతో రైతన్నలు ముందు జాగ్రత్తగా నాట్లకు ముందుగా పొలాల్లో ఈ జూమి పెంపకం చేస్తున్నారు. కాలువకు నీరు వచ్చే సమయంలో ట్రాక్టర్ల ఇనుప చక్రాలతో దీనిని దమ్ము చేసి ఎరువుగా మార్చుతారు. నాట్లు వేసిన అనంతరం పంటకు అనుగుణంగా మారుతుందని ఉద్దేశంతో ప్రతి రైతు కంప్లి, కురుగోడు, దేవసముద్రం, మెట్రి, చిక్కజాగనూరు, ఎమ్మిగనూరు, నెల్లూడి, కురుగోడు, కలకంబ్ల తదితర గ్రామాల్లో వ్యవసాయ శాఖ కేంద్రాల్లో జూమి పెంపకం చేసి బోర్ల ద్వారా పెంపకం చేపడుతున్నారు. తుంగభద్ర జలాశయానికి నీరు పూర్తిగా వచ్చినట్లయితే ఈ యేడాది జూలై ఆఖరులోగా నాట్లు కూడా వేసేందుకు సిద్దమవుతున్నామని రైతులు తెలుపుతున్నారు.

గాంధీ పార్కును అభివృద్ధి చేయాలి



కుడితిని ముఖ్య అధికారికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

కంప్లి, జూన్ 21 : కుడితిని పట్టణంలోని పాతబస్టాండు వద్ద ఉన్న గాంధీపార్కును అభివృద్ధి చేసి అక్కడ మహాత్మాగాంధీ నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భీమ్ ఫౌండేషన్, కన్నడ రక్షణ వేదిక పదాధికారులు శుక్రవారం కుడితిని ముఖ్య అధికారి తీర్థ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రమేష్, నరసింహరాజు, తిమ్మప్పలు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పార్కు అభివృద్ధికి నోచుకోలేక పోతోందన్నారు. మద్యపానం చేసే వారికి అడ్డాగా మారిందని, ఎన్నో సార్లు మనవిపత్రం ఇచ్చినా అధికారులు గాంధీ పార్కుపై దృష్టి సారించడం లేదన్నారు. త్వరలోనే నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆదర్శంగా వుండేలా తీర్చిదిద్దాలన్నారు. వారితోపాటు గ్రీన్ ఫౌండేషన్, రక్షణ వేదిక పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

శుద్ధి చేసిన నీటి సరఫరాకు ప్రాధాన్యం

జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి కేవి త్రిలోకచంద్ర



మాట్లాడుతున్న జిల్లాకార్యదర్శి త్రిలోకచంద్ర , డీసీ ప్రశాంత్‌కుమార్

బళ్లారి సిటీ, జూన్ 21: జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్లోరినేషన్‌తో శుద్ధి చేసిన నీటి సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి కేవి. త్రిలోకచంద్ర అన్ని తాలూకాల, పంచాయితీల ఈఓలను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని జిల్లాపంచాయితీ హాల్లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి అభివృద్ధి కార్యక్రమంపై నెలవారీ ప్రగతి సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ముందస్తు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తాగునీటిని మరగించి తాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కలుషిత నీరు సరఫరా చేయరాదని, ఈవిషయంలో జాగ్రత్తగా ఉండాలని, నీటివనరులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నీటి నమూనాలను పరీక్షించిన తర్వాతే నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. జిల్లాలో ముందస్తు వర్షాలు, రుతుపవన వర్షాలు బాగా కురుస్తుండడంతో వ్యవసాయ పనులు బాగా జరుగుతున్నాయని, జిల్లా రైతులకు విత్తనాలు,ఎరువులు, పరుగుమందుల సరఫరాలో ఎలాంటి కొరత లేకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాసిరకం విత్తనాల సరఫరా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పంటల బీమాను తప్పకుండా నమోదు చేసుకునేలా చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వానకాలం సీజన్‌కు సంబంధించి వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, వేరుశనగ, కంది, మినుము కలిపి మొత్తం 16.223 క్వింటాళ్ల విత్తనాల నిల్వ ఉందన్నారు. ఈసందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవసాయ సంయుక్త సంచాలకులు మల్లికార్జున మాట్లాడుతూ విత్తనాల పంపిణీ పనులు ప్రారంభించామని,ఇప్పటికే 921క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశామన్నారు. జిల్లాలో విద్యారంగం అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. అభ్యర్థులు పోటీ పరీక్షలకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వ సంబంధిత పనుల కోసం ప్రజలు తిరగలేరని, అధికారులందరూ నిర్ణీత గడువులోగా పని చేయాలని ఆదేశించారు. తదుపరి జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ హాస్టళ్లలో పరిశుభ్రతపై ఫిర్యాదులు అందుతున్నాయని అధికారులు హాస్టళ్లను సందర్శించి పరిశీలించాలన్నారు. ప్రగతి యాప్‌లో సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సందీప్ సూర్యవంశీ, సబ్ డివిజనల్ అధికారి హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం



గ్రామీణ ప్రాంతాల్లో యోగా చేస్తున్న విద్యార్థులు



గోడేహాళ్ తిరుమల పాఠశాలలో యోగ విన్యాసాలు

బళ్లారిరూరల్, జూన్ 21 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గ్రామీణ ప్రాంతాలతో పాటు బళ్లారి నగరంలో ఘనంగా జరుపుకున్నారు. బళ్లారిరూరల్ పరిధిలోని మోకా, పీడీ హళ్లి, రూపనగుడి, పలు గ్రామాల హైస్కూళ్లతో పాటు గోడేహాళ్ తిరుమల స్కూలు ఆవరణంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగా వల్ల ఆరోగ్యాన్ని ఎలా చూసుకోవాలనే విషయాన్ని తిరుమల స్కూలు కరెస్పాండెంట్ యల్లప్ప వివరించారు. అదేవిధంగా బళ్లారి నగరంలో మహిళా మండలి అధ్యక్షురాలు పుష్ప చంద్రశేఖర్ నేతృత్వంలో మహిళలకు యోగా గురించి పలు విషయాలు తెలియజేసి ప్రతినిత్యం ఉదయం అరగంటపాటు, సాయంత్రం అరగంట యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా వుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా గురూజీ వినోద్ వీరికి ప్రతినిత్యం యోగా పై పలు సూచనలు అందిస్తారని తెలిపారు.

హోసూరు జోన్

ఆకట్టుకున్న విద్యార్థుల యోగ విన్యాసాలు



యోగ విన్యాసాల్లో పాల్గొన్న విద్యార్థులు

హోసూరు, జూన్ 21: హోసూరులో యోగా దినోత్సవం సందర్బంగా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు యోగ విన్యాసాలు నిర్వహించారు. హోసూరు తమిళనాడు సిగ్నల్ కర్మాగారం ఎన్‌సిసి సేలం కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ సూరజ్ నాయర్, హోసూరు ఆర.వి.ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, మహర్షి విద్యా మందిర్, 150 మంది ఎన్‌సిసి విద్యార్థులు, 700 మంది ఇతర పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్బంగా యోగా విన్యాసాలను నిర్వహించారు. మహర్షి విద్యా మందిర్ పాఠశాల క్రీడా మైదానంలో పాఠశాల ప్రిన్సిపాల్ శైలా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మహర్షి విద్యా మందిర్ పాఠశాల కార్యదర్శి శ్రీ వెంకటరమణన్ విశిష్ట అతిథిగా హాజరై యోగా సాధన వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

కార్పొరేషన్ నుంచి సీతారాంనగర్‌కు తాగునీటి సరఫరా

హోసూరు, జూన్ 21: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 28 వ వార్డు సీతారాం నగర్‌కు కార్పొరేషన్ ద్వారా తాగునీరు అందించారు. సీతారాంనగర్ ఏరియాలో రెండు నీటి ట్యాంక్‌లకు నీరు సరఫరా చేశారు. కార్పొరేషన్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ వెనుకఉన్న ఎలివేటెడ్ ప్రాంతాలో అవసరమైన ఒత్తిడితో తాగునీరు వెళ్లడంలేదు. దీంతో ఎత్తైన ప్రాంతానికి తాగునీటికోసం కొందరు నిరసన తెలియజేశారు. కార్పొరేషన్ తాము చేస్తున్న పనులను వివరించడంతో ప్రజలు రోడ్లలో నిరసన విరమించు కున్నారు. కార్పొరేషన్ అధికారులు శుక్రవారం తాగునీటిని సరఫరా చేశారు. ఎట్టకేలకు అధికారులు ఆ ప్రాంతానికి తాగునీటిని సరఫరా చేశారని మున్సిపల్ కమీషనర్ స్నేహ తెలిపారు.

యోగాసనాల వల్ల మానసిక ప్రశాంతత

- రాయచూరులో ఉత్సాహంగా యోగాసనాలు








రాయచూరు మహాత్మాగాంధీ స్టేడియంలో యోగాసనాలను ప్రదర్శిస్తున్న ప్రజలు

రాయచూరు, జూన్ 21 : నిత్య జీవితంలో ఒత్తిడికి గురయ్యే వారికి యోగసాధన అత్యంత ఉపయోగకరమని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారామ్ పాండ్వె అన్నారు. యోగ సాధన వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాయచూరు మహత్మగాంధీ స్టేడియంలో సామూహిక యోగా శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జడ్పీ సీఈఓ మాట్లాడుతూ, భారత దేశం యోగా విద్యకు పుట్టినిల్లువంటిదన్నారు. ఈ సందర్బంగా యోగా గురువు డాక్టర్ తిమ్మప్ప వండెపల్లి వివిధ రకాల ఆసనాలను వేయించి వాటి వల్ల ఒనగూడే ఉపయోగాల గురించి వివరించారు. యోగసాధన వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇంతకు పూర్వం నిర్వహించిన యోగా పోటీల్లో విజేతలైన వారికి బహుమతులను అందజేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

చిత్తూరు సుబ్రమణ్య పిళ్లై (జయంతి)



సంగీత కళానిధి చిత్తూరు సుబ్రమణ్య పిళ్లై 1898 జూన్ 22న చిత్తూరు జిల్లా పలమనేరు మండలం (అప్పటి పుంగనూరు తాలూకా) కొలమాసనపల్లెలో జన్మించారు. బాలమేధావిగా ఐదవ యేటనే శాస్త్రీయసంగీతం పాడడం ఆరంభించారు. గురుకుల పద్ధతిలో 14ఏళ్లపాటు శాస్త్రీయ సంగీతాన్ని నేర్చుకున్నారు. తిరుపతిలో త్యాగరాజస్వామి వార్షికోత్సవంలో ఇన్‌స్ట్రుమెంటల్ విధానం ప్రయోగించారు. మద్రాసులోని కేంద్ర సంగీత కళాశాలలో ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. కర్ణాటక సంగీత విద్వాంసులు, వాగ్గేయకారులుగా రాణించారు. దేశమంతటా సంగీత కచేరీలు నిర్వహించారు. 'సంగీత విద్వన్మణి', ఇసై పేరరింజర్, సంగీత కళానిధి, సంగీత నాటక అకాడమీ అవార్డు, సంగీత కళా శిఖామణి అవార్డు, గానకళా ప్రపూర్ణ, స్వరచక్రవర్తి తదితర పురస్కారాలు అందుకున్నారు. 1975 అక్టోబరు 18న పరమపదించారు. 1998లో శతాబ్ది ఉత్సవాలు జరిగాయి.

ఎల్‌వీ ప్రసాద్ (వర్ధంతి)




ఎల్‌వీ ప్రసాద్ 1908 జనవరి 17న పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు తాలూకా సోమవరప్పాడు గ్రామంలో జన్మించారు. అసలు పేరు అక్కినేని లక్ష్మీవరప్రసాద రావు. తెలుగు సినీ నిర్మాత, దర్శకుడు, నటుడు. హిందీ, తమిళ, తెలుగు, కన్నడతోపాటు పలు భారతీయభాషలలో 50 సినిమాలకు ఆయన దర్శకత్వం వహించి, నిర్మించి, నటించారు. హిందీ, తమిళ, తెలుగు భాషలలో తొలి టాకీ చిత్రాలైన ఆలంఆరా, కాళిదాసు, భక్తప్రహ్లాద మూడింటిలోనూ నటించిన ఘనత ఆయనదే. రఘుపతి వెంకయ్య అవార్డు, దాదా సాహెబ్‌ఫాల్కే అవార్డు వంటి ఉన్నత పురస్కారాలు అందుకున్నారు. హైదరాబాద్‌లో లాభాపేక్షలేని నేత్ర వైద్యశాలకు లక్షలాది రూపాయలతోపాటు 5ఎకరాల స్థలం దానం చేశారు. త్యాగానికి గుర్తుగా ఆయన పేరు పెట్టారు. 1994 జూన్ 22న కన్నుమూశారు.

అడాయి యోనత్ (పుట్టినరోజు)



ఇజ్రాయెల్ దేశం నుంచి నోబెల్ పురస్కారం అందుకున్న తొలి మహిళ అడాయి యోనత్ 1939 జూన్ 22న జెరూసలెంలో జన్మించారు. 2009లో రసాయన శాస్త్రంలో వెంకట రామన్ రామకృష్ణన్ అండ్ థామస్‌లతో కలసి పురస్కారం అందుకున్నారు. హెలెన్ అండ్ మిల్టన్ సంస్థకు డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. యునైటెడ్ స్టేట్స్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లోనూ, అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌లోనూ సభ్యురాలు. 2014లో పొంటిఫికల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో సాధారణ సభ్యురాలిగా పోప్ ఫ్రాన్సిస్‌చే గుర్తింపు పొందారు. హార్వే ప్రైజ్, ఉల్ఫ్ ప్రైజ్ ఇన్ కెమిస్ట్రీ, లోరియల్ యునెస్కో అవార్డు, అల్బర్ట్ ఐన్‌స్టీన్ వరల్డ్ అవార్డ్ ఫర్ సైన్స్ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2020లో ఫారిన్ మెంబర్ ఆఫ్ ది రాయల్ సొసైటీలో సభ్యురాలు అయ్యారు, 2023లో జాగిలోనియన్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

డాన్ బ్రౌన్ (పుట్టినరోజు)



డేనియల్ గెర్హార్డ్ బ్రౌన్ 1964 జూన్ 22న జన్మించారు. అమెరికాకు చెందిన రచయిత. థ్రిల్లర్ నవలలు ఏంజెల్స్ అండ్ డెమోన్స్, ది డా విన్సీకోడ్, ది లాస్ట్ సింబల్, ఇన్‌ఫెర్నో అండ్ ఆరిజిన్ వంటివి పేరొందాయి. ప్రత్యేకించి 'ది డా విన్సీకోడ్' నవల ప్రపంచవ్యాప్తంగా పాఠకుల ఆదరణ పొందింది. ఆయన నవలలు 56 భాషలలో ప్రచురితమై ప్రపంచవ్యాప్తంగా 200 మిలియన్ కాపీలకుపైగా అమ్ముడయ్యాయి. 2005లో టైమ్ మ్యాగజైన్‌లో వందమంది ప్రభావితుల జాబితాలో చోటు దక్కించుకున్నారు.

విజయ్ (పుట్టినరోజు)



జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్ 1974 జూన్ 22న మద్రాసులో జన్మించారు. 'విజయ్'గా పేరొందారు. అభిమానులు, మీడియా అతడిని దళపతిగా పిలుస్తారు. తమిళ నటుడు, డ్యాన్సర్, నేపథ్య గాయకుడు, మానవతావాది. తమిళం సహా ఇతర భాషల్లో 65 సినిమాలలో నటించారు. అత్యధిక రెమ్యూనరేషన్ అందుకుంటున్న నటులలో ఒకరు. తమిళనాడు ప్రభుత్వంచే మూడు ఫిల్మ్ అవార్డులు, ఒక సైమా అవార్డు, స్టార్ ఇం డియాచే 8 విజయ అవార్డులు, ఇతర పురస్కారాలు పొందారు. పాపులర్ సెలెబ్రిటీలలో ఒకరిగా నిలిచారు. యునైటెడ్ స్టేట్స్ కాన్సులేట్ జనరల్ చెన్నై విభాగంచే 'వి గో గ్రీన్' నినాదంతో ప్రపంచవ్యాప్తంగా జాగృతి కల్పించారు. ఆయన సామాజిక సేవలకుగాను గౌరవ డాక్టరేట్ దక్కింది.

లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలిగా మంగళగౌరి

దొడ్డబళ్ళాపుర, జూన్ 21: దొడ్డబళ్ళాపుర పట్టణంలోని లయన్స్‌క్లబ్‌లో కొన్నేళ్లుగా సభ్యురాలిగా సేవలందిస్తున్న మంగళగౌరి పర్వతయ్య 2024-25 సంవత్సరానికి నూతన అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. పట్టణ శివారులోని బాశెట్టిహళ్ళిలోగల అన్నపూర్ణేశ్వరి కన్వెన్షన్‌పార్టీహాల్‌లో శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ కే వంశీధరబాబు 2024-25 సంవత్సరానికి నూతన అధ్యక్షులు, పదాదికారులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌కు 50ఏళ్లు నిండాయని అన్ని క్లబ్‌లకంటే మాదిరిగా మెరుగైన సమాజసేవలు అందిస్తున్నవారికి గౌరవం ఇవ్వడం లయన్స్‌క్లబ్ కర్తవ్యమన్నారు. నూతన పదాదికారులు కార్యదర్శిగా కె.పి.లక్ష్మీనారాయణ్, కోశాధికారిగా గోపాల్, జాయింట్ సెక్రటరీగా భారతి మంజునాథ, ఉపాధ్యక్షులుగా ఎస్‌వీ నంజుండస్వామి, వసుంధరారెడ్డి, ఇంకా ఆర్‌ఎస్ మంజునాథ్, సి.ఎన్ రాజశేఖర్, బిపి ప్రియాంక, హెచ్‌కె నటరాజ్, రేఖా వెంకటేశ్, కెవి ప్రభుస్వామి, ఎస్‌డి పర్వతయ్య, కె మోహనకుమార్, ఆర్ వెంకటేశ్, ఎస్‌పి వైఢూర్య తదితరులు నియమితులైనట్టు ప్రకటించారు.

యోగాతో మెరుగైన ఆరోగ్యం



విజయపురలో యోగా దినోత్సవం



దొడ్డబళ్లాపుర యోగా డేలో ప్రిన్సిపాల్ సదాశివరామచంద్రగౌడ



కోలారులో యోగా దినోత్సవంలో ఎంపీ మల్లేశ్‌బాబు తదితరులు

▸ పలు చోట్ల ఉత్సాహంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు

బంగారపేట, జూన్ 21: క్రమం తప్పని యోగాభ్యాసం ద్వారా మెరుగైన శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమని కోలారు ఎంపీ మల్లేశ్‌బాబు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లా కేంద్రమైన కోలారు పట్టణంలోని సర్ ఎం విశ్వేశ్వరయ్య జిల్లా క్రీడామైదానంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జిల్లా ఆయుష్‌శాఖ, యువజనులు, క్రీడలశాఖ తదితర సంఘాల సహకారంతో శుక్రవారం నిర్వహించారు. ఎంపీ మల్లేశ్‌బాబు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించేలా ఐక్యరాజ్యసమితిలో ప్రతిపాదించడంతో 2015 నుంచి అమలవుతోందన్నారు. ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజు మాట్లాడుతూ యోగాభ్యాసం ద్వారా శరీరం తనదైన తేజస్సు కలిగి ఉంటుందన్నారు. మానసిక ఒత్తిడి తగ్గుతుందని, అంతేకాకుండా రోజంతా ఉల్లాసంగా గడిపేందుకు వీలవుతుందన్నారు. యోగా ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిందన్నారు. అన్ని యోగాసంస్థలు ఉత్తమంగా వ్యవహరిస్తున్నాయన్నారు. 186 దేశాలలో యోగాకు గుర్తింపు ఉందన్నారు. మన సనాతన రుషులు అందించిన యోగా ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వ్యాపించిందన్నారు. గత పదిరోజులుగా జిల్లాలోని అన్ని వసతి పాఠశాలల్లో యోగాపై తర్ఫీదు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సమాజ సేవకుడు సీఎంఆర్ శ్రీనాథ్, కోలారు తహసీల్దారు హర్షవర్ధన్, నగరసభ కమిషనర్ శివానంద్, యువజనులశాఖ సహాయక డైరెక్టర్ గీతా, పాఠశాల విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణమూర్తి, జిల్లా ఆరోగ్యాధికారి డాక్టర్ జగదీశ్, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ రాఘవేంద్ర శెట్టిగార్, పతంజలి యోగ శిక్షణ సమితికి చెందిన బిసాప్‌గౌడ, మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో..

బాగేపల్లి: పట్టణంలోని పాఠశాలలు, ఇతర చోట్ల అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం ఉత్సాహంగా సాగింది. ప్రత్యేకించి యంగ్ ఇండియాస్కూల్‌లో నిర్వహించిన యోగా ఆసనాల కార్యక్రమం ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆసనాలు వేశారు. పాఠశాల సంస్థాపక అధ్యక్షుడు డి శివణ్ణ మాట్లాడుతూ దేహం, మనస్సు రెండూ స్వస్థతగా ఉండేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఔషధరహిత చికిత్సా విధానంగా ఉందన్నారు. మిత ఆహారం, ఉపవాసంతోపాటు వ్యాయామం వంటివి పాటించడం ద్వారా చక్కటి ఆరోగ్యం సాధ్యమన్నారు. పతంజలి యోగ శిక్షణ ముఖ్యులు మునిరామయ్య, యోగా శిక్షకులు మునిరాజు, ప్రధానోపాధ్యాయురాలు కల్పనా తదితరులు పాల్గొన్నారు.

చింతామణిలో...



చింతామణిలో ఆర్‌కె విజన్ పాఠశాల విద్యార్థుల విన్యాసం

చింతామణి, జూన్ 21: యోగాను నిరంతరం అభ్యాసం చేయడం ద్వారా కామ, క్రోధ, మద మాత్సర్యాలను నియంత్రించవచ్చునని, ఇతరులతో సత్సంబంధాలు సాధ్యమని జెఎంఎఫ్‌సి కోర్టు రెండో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి నాగవేణి అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ దినోత్సవాన్ని పట్టణంలో పలుచోట్ల అర్థవంతంగా ఆచరించారు. ఇందులో భాగంగా బెంగళూరు డబుల్‌రోడ్డులోని కోర్టు ఆవరణలో తాలూకా న్యాయసేవల సమితి, న్యాయవాదుల సంఘం, పతంజలి యోగ శిక్షణ సమితి సంయుక్తంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ప్రాచీనకాలంలో ప్రతిరోజూ ఆరోగ్యం కోసం యోగాను పాటించేవారన్నారు. ప్రధాన సివిల్ న్యాయమూర్తి, మెంబర్ సెక్రటరీ, లీగల్‌సెల్ సేవా సమితి హెచ్‌వి శైలజా, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బీ శ్రీనాథ్, పతంజలి యోగ సమితి సంచాలకులు నారాయణప్ప తదితరులు భాగస్వామ్యులయ్యారు. సుమారు 200మందికిపైగా పాల్గొన్నారు.

ఆర్‌కే విజన్ పాఠశాలలో...

పట్టణంలోని ఆర్‌కె విజన్ పాఠశాలలో యోగా దినోత్సవం సంబరంగా సాగింది. పలువురు విద్యార్థులు చేసిన యోగా విన్యాసాలు సభికులను ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థ కార్యదర్శి ప్రేమలతా మాట్లాడుతూ మన పూర్వీకులు అందించిన గొప్ప వరంలాంటిది యోగా అని ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉందన్నారు. క్రమం తప్పని యోగా భ్యాసం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతోపాటు ఆధ్యా త్మిక ప్రయోజనాలు కూడా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ జవికె రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం అభ్యాసం అవసరం

దొడ్డబళ్ళాపుర, జూన్ 21: నిరంతర యోగాభ్యాసం చేస్తూ చక్కటి జీవన విధానాలు పాటిస్తే మనమంతా వందేళ్లు బతకడం సాధ్యమేనని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సదాశివ రామచంద్రగౌడ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటైన అంతర్జాతీయ దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఇటీవలికాలంలో యువతలో ఉత్సాహం కొరవడిందని, దురలవాట్లకు లోనవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. వీటినుంచి బయట పడేసేందుకు యోగాభ్యాసం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సిద్దరామరాజు, ప్రొఫెసర్ నీరజాదేవి, డాక్టర్ ప్రకాశ్ మంటెద, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌లో..

బొమ్మనహళ్ళి, జూన్ 21: యోగాతో ఎన్నో ఆరోగ్యపరమైన ప్రయోజనాలు ఉన్నాయని ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. హెచ్‌ఎస్‌ఆర్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో వాజ్‌పేయ్ క్రీడా మైదానంలో శుక్రవారం ఏర్పాటైన అంతర్జాతీయ దినోత్సవంలో పాల్గొన్నారు. సుమారు రెండు గంటలపాటు సాగిన కార్యక్రమంలో వివిధ రకాల యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరేళ్లుగా ఏటా యోగా దినోత్సవం ఆచరిస్తున్నట్టు తెలిపారు. యోగాను మనదైనందిన జీవితంలో ఒక భాగం కావాలన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచానికి యోగాను అందచేసిన ఘనత భారతదేశానికి దక్కడం గర్వకారణమన్నారు. మాజీ కౌన్సిలర్‌లు గురుమూర్తిరెడ్డి, శ్రీనివాసరెడ్డితోపాటు విజయలక్ష్మి, లక్ష్మణరెడ్డి, మహేశ్వరి, పెద్దసంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

శిడ్లఘట్టలో...


శిడ్లఘట్ట, జూన్ 21: నేటి ఆధునిక యుగంలో యోగా, ధ్యానం వంటి అవసరం ఎంతైనా ఉందని రామచంద్ర మిషన్ తాలూకా సంచాలకులు జయశ్రీ కేదార్‌నాథ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని వాసవి విద్యాసంస్థలో అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజం కోసం యోగా ఆవశ్యకతను వివరించారు. అలాగే ఆహారపు అలవాట్లు, జీవనశైలి కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్నారు. విద్యార్థుల యోగా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వాసవి విద్యాసంస్థ అధ్యక్షుడు కృష్ణయ్యశెట్టి అధ్యక్షత వహించగా సంస్థ పాలనాధికారి రూపసి రమేశ్ ప్రారంభోపన్యాసం చేశారు. వాసవిమహిళా మండలి అధ్యక్షురాలు గజలక్ష్మి, భారతి రాజేశ్, ఆర్యవైశ్యమండలి ఉపాధ్యక్షుడు ఎన్ఆర్ మహేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. తాలూకా వ్యాప్తంగా యోగా దినోత్సవ కార్యక్రమాలు జరిగాయి.



శిడ్లఘట్టలో వాసవి విద్యాసంస్థలో యోగా దినోత్సవం



చింతామణి కోర్టు ఆవరణలో యోగా దినోత్సవం



యంగ్ ఇండియా పాఠశాలలో విద్యార్థుల యోగా విన్యాసం



హెచ్‌ఎస్ఆర్ లే అవుట్‌లో యోగా డేలో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి

అకాడమీలు, ప్రాధికారల మధ్య సమన్వయ సమితి

▸ మంత్రి శివరాజ్ తంగడగి



విధానసౌధలో సమీక్షా సమావేశంలో మంత్రి శివరాజ్ తంగడగి

బెంగళూరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): కన్నడ సంస్కృతిశాఖ పరిధిలోకి వచ్చే అకాడమీలు, ప్రాధికారల నడుమ సమగ్రంగా పనిచేసేందుకు సమన్వయ సమితి ఏర్పాటు చేస్తామని కన్నడసంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడగి అభిప్రాయపడ్డారు. శుక్రవారం అన్ని అకాడమీలు, కార్పొరేషన్‌ల ముఖ్యులతో విధానసౌధలో సమీక్ష జరిపారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ రెండు నెలలకోసారి అకాడమీ అధ్యక్షులు, సభ్యులతో సభలు జరపాలన్నారు. రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా వైవిధ్యమైన కార్యకలాపాలు కొనసాగించాలన్నారు. అకాడమీల అన్ని వ్యవహారాలలోనూ కర్ణాటక అనే పేరుతోపాటు సువర్ణ సంబరం లోగోను ఉపయోగించాలన్నారు. మహారాష్ట్ర సరిహద్దులో కన్నడ పాఠశాలలకు మరాఠా ఉపాధ్యాయులను నియమించిన విషయమై ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. కన్నడ పాఠశాలలు ఆ ప్రదేశ అభివృద్ధికి పనిచేస్తున్నాయన్నారు. బెంగళూరుతోపాటు అన్ని ప్రాంతాల్లోనూ కన్నడ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

హైవేపై దోపిడీ..!

తీవ్రంగా గాయపరిచి.. నగదు దోచుకుని పరారీ

నిద్రిస్తున్నవారిపై రాళ్ల వర్షం

చెన్నేకొత్తపల్లి, జూన్ 21: మండల పరిధిలోని ఎన్ఎస్ గేటు వద్ద జాతీయ రహదారిపై దోపిడీ దొంగల ముఠా బీభత్సం సృష్టించింది. వాహన డ్రైవర్లపై రాళ్లు, బీరు బాటిళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. వారి వద్ద ఉన్న రూ.20 వేల నగదును దోచుకువెళ్లింది. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుందని రామగిరి సీఐ శివాంజనేయులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గాకు చెందిన డ్రైవర్లు మహేశ్, శ్రీనివాస్, హైదరాబాద్‌కు చెందిన రవి.. హైదరాబాద్‌లోని ఓ షోరూం నుంచి ప్రైవేటు బస్సులను కేరళకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఎన్ఎస్ గేటు సమీపంలోని అమర నారాయణస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారి పక్కన వాహనాలను ఆపి నిద్రపోయారు. కర్ణాటకలోని పేరేచంద్రకు చెందిన 407 వ్యాన్ డ్రైవర్లు హెచ్‌ఆర్ శ్రీనివాస్, మనోహర్ హైదరాబాద్‌లో మామిడికాయలను అన్‌లోడ్ చేసి తిరిగి వస్తూ.. అదే ప్రాంతంలో తమ వ్యాన్‌ను ఆపి నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో 25 నుంచి 30 ఏళ్ల వయసున్న ముగ్గురు దొంగలు వారిపై రాళ్లు, బీరు బాటిళ్ల వర్షం కురిపించారు. డ్రైవర్లు నిద్ర నుంచి తేరుకునేలోగా తీవ్రంగా గాయపరిచారు. వారి వద్ద ఉన్న రూ.20 వేల నగదు దోచుకుని పారిపోయారు. దొంగల దాడిలో బస్సుల డ్రైవర్లు మహేశ్, శ్రీనివాస్, రవి తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. వ్యాన్ డ్రైవర్లు స్వల్పంగా గాయపడ్డారు. దాడికి పాల్పడిన ముగ్గురు యువకులు ముసుగులు ధరించి ఉన్నారని, హిందీలో మాట్లాడారని బాధితులు తెలిపారు. దాడి చేయవద్దని వేడుకున్నా వినిపించుకోలేదని, తీవ్రంగా కొట్టారని తెలిపారు. వ్యాన్ డ్రైవర్ హెచ్‌ఆర్ శ్రీనివాస్ నుంచి పోలీసులు ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసుకున్నారు. దొంగల ముఠా కోసం గాలిస్తున్నామని తెలిపారు.

నగరీకరణ సమస్యలపై పరిశోధనలు అవసరం

బెంగళూరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): నగరీకరణ సమస్యలపై పరి శోధనలు అవసరమని మాజీ ఎంపీ రాజీవ్‌గౌడ అభిప్రాయపడ్డారు. మెర్సిడెస్‌బెంజ్ అండ్ డెవలెప్‌మెంట్ ఇండియా, సుస్థిర భారత నిర్మాణం అనే అంశంపై జన అర్బన్ స్పేస్ ఫౌండేషన్ సహకారంతో పరిశోధనలు జరిపింది. ఇందుకు సంబంధించిన నివేదికను శుక్రవారం ప్రకటించారు. 15 నిమిషాలలో నైబర్‌హుడ్స్‌ను నిర్మించేలాంటి పరిశోధన చేయడంపట్ల మెర్సిడెస్‌బెంజ్ సంస్థను రాజీవ్‌గౌడ అభినందించారు. నగరాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాకేశ్‌సింగ్ మాట్లాడుతూ వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న నగరీకరణలో ప్రమాదాలు కూడా అంతేస్థాయిలో ఉంటాయన్నారు. పరిసరాల విజ్ఞానం, ప్రకృతి వనరులు, జీవన పరిస్థితులపై ప్రగతి అవసరమన్నారు. మెర్సిడెస్‌బెంజ్ రీసెర్చ్ డెవలెప్‌మెంట్ ఇండియా ఎండీ సీఈఓ మనుసాలె మా ట్లాడుతూ అభివృద్ధితోపాటు సమస్యలపైన సుస్థిర సమగ్రత సాధించేం దుకు పరిశోధనలు చేశామన్నారు. జన అర్బన్ స్పేస్ ఫౌండేషన్ డైరెక్టర్ నిత్యారమేశ్ మాట్లాడుతూ పూర్వనగరం, అభివృద్ధి చెందిన తర్వాత వచ్చిన మార్పులు, మాస్టర్ ప్లాన్‌ల ఆంతర్యాన్ని గుర్తించామన్నారు. బెంగళూరు వంటి నగరాలలో సమస్యల పరిష్కారానికి సుదీర్ఘమైన ప్రణాళికలు అవసరమన్నారు.

దేశీయ మార్కెట్‌లోకి అడ్మిరల్ గృహోపకరణాలు

బెంగళూరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన అడ్మిరల్ కంపెనీ గృహోపకరణాలు దేశీయ మార్కెట్‌లోకి తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. అడ్మిరల్ దక్షిణ ఆసియా సీఈఓ విశాల్ సక్సేనా పేరిట శుక్రవారం బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. అడ్మిరల్ 90 ఏళ్ల పరంపర కలిగి ఉందని ఎలక్ట్రానిక్స్‌లో నాణ్యతకు మారుపేరుగా ఉన్నట్లు ప్రకటించారు. ఫ్లిప్‌కార్ట్ ద్వారా మార్కెటింగ్ చేస్తున్నట్లు ప్రకటించారు ఎల్‌ఈడీ టీవీలు, ఏసీలు, వాషింగ్ మిషన్‌లు, రెఫ్రిజిరేటర్‌లతో పాటు వివిధ గృహోపకరణాలు అందుబాటులో ఉంటాయని ప్రకటించారు. ఫ్లిప్‌కార్ట్ లార్జ్ అప్లయన్సస్ వైస్ ప్రెసిడెంట్ కునాల్‌గుప్తా అభిప్రాయం మేరకు దేశీయ మార్కెట్‌లోకి అడ్మిరల్ తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. నెలాఖరుకు మార్కెట్‌లోకి వస్తాయన్నారు.

పెట్టుబడుల లక్ష్యంగా ఐపీఓ స్టాన్లీ లైఫ్‌స్టైల్

బెంగళూరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన దేశంలోని అతిపెద్ద సూపర్ ప్రీమియం, లగ్జరీ ఫర్నీచర్ బ్రాండ్ స్టాన్లీ లైఫ్‌స్టైల్ పెట్టుబడులు సాధించే లక్ష్యంగా ఐపీఓలోకి ప్రవేశించింది. ఈమేరకు కంపెనీ ప్రతినిధులు బెంగళూరులో శుక్రవారం ప్రకటించారు. ముఖవిలువ రెండు రూపాయలు ఈక్విటీ షేరుకు రూ.351-369లుగా ధర నిర్ణయించారు. శుక్రవారంతో ఆరంభమైన ఆఫర్ ఈనెల 25తో ముగుస్తుందని ప్రకటించారు. 2022 ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా గృహోపకరణాలలో స్టాన్లీ నాల్గవ స్థానంలో ఉందని 2023 డిసెంబరు ఆఖరుకు అత్యాధునికమనిపించే కేట్‌లాగ్‌లు, డిజైన్‌లు 300ల కంటే ఎక్కువ లెదర్ రంగులు ఫ్యాబ్రిక్ ఉత్పత్తులు మార్కెట్ చేసినట్లు ప్రకటించారు. కంపెనీ బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీ, బొమ్మనహళ్ళికు అనుబంధమైన జిగణి రెండు ఉత్పత్తి కేంద్రాలను కలిగి ఉన్నట్లు ప్రకటించారు.

కలబురగిలో సిలిండర్ పేలుడు

▸ పదిమంది హోటల్ కార్మికులకు గాయాలు

బెంగళూరు, జూన్ 21(ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో పదిమందికిపైగా హోటల్ కార్మికులు గాయపడిన సంఘటన కలబురగి నగరం అప్పాచెరువుకు అనుబంధంగా ఉండే సప్తగిరి హోటల్‌లో చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం 6.30 గంటలకు హోటల్ సిబ్బంది తినుబండారాలు చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలోనే సిలిండర్ పేలింది. పదిమంది గాయపడగా మిగిలినవారు పరుగులుతీశారు. తీవ్రంగా గాయపడిన ఇరువురిని ట్రామాకేర్ సెంటర్‌కు మరో 8మందిని జిల్లా ఆసుపత్రిలో తరలించారు. సిలిండర్ పేలుడుకు బహుళ అంతస్థుల భవనానికి నష్టం కలిగింది. హోటల్‌లో టేబుళ్లు ఇతర వస్తువులు చెల్లాచెదురయ్యాయి. సుమారు కిలోమీటరుదాకా శబ్దం వినిపించింది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపకశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హోటల్ యజమాని శరణబసప్ప మీడియాతో మాట్లాడుతూ సాధారణంగా హోటల్ 8 గంటలకు తెరుస్తామని గంటన్నరముందే సిలిండర్ పేలడంతో పెను ప్రమాదం తప్పినట్టయ్యిందన్నారు. లేదంటే హోటల్‌కు వచ్చే వినియోగదారులు పెద్దసంఖ్యలో ఉండేవారన్నారు. సిటీ పోలీస్ డిప్యూటీ కమిషనర్ కన్నికా సిక్రివాల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సిలిండర్ పేలడంతోనే ప్రమాదం జరిగినట్టు గుర్తించామని సమగ్ర దర్యాప్తు జరుపుతామన్నారు. గాయపడినవారి నుంచి వివరాలు సేకరిస్తామన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

దొమ్మసంద్ర, జూన్ 21: ఆనేకల్ తాలూకా సర్జాపుర పట్టణం కోటెవీధిలో ఉంటున్న వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. రిహాన్ (24) మృతి చెందినట్టు గుర్తించారు. సరిహద్దులోని తమిళనాడు రాష్ట్రం డెంకణీకోట సమీపాన కెలకందరహళ్ళికి చెందిన వీరు 18రోజులక్రితం సర్జాపుర నివాసి శభాష్‌తో వివాహం జరిగింది. బుధవారం అర్ధరాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలు స్తోంది. గొర్రెలను విక్రయించి సుమారు 8 లక్షల రూపాయలతో పెళ్లి ఘనంగా చేశా రు. అయితే ఇలా అకస్మికంగా అనుమానస్పద రీతిలో మృతి చెందడంతో కుటుం బంలో విషాదం నెలకొంది. రిహాన్ తండ్రి సనావుల్లా స్థానిక సర్జాపుర పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.